

# పయనం

పి.యస్. నారాయణ

సాయంత్రం అవుతున్నదీ అంటే అదో రకం భయం. ఏంచేయాలి? ఎక్కడికి వెళ్ళాలి?...

జీవితం మహా బోరయి పోతున్నది. అటువంటప్పుడు సావిత్రే నాకు గుర్తుకు వస్తుంది.

సరాసరి వెళ్ళి తలుపు తట్టాను.

తలుపు తీస్తూనే "హలో" అన్నది.

"హలో!"

"నాలుగు రోజులైంది కనబడి!"

"పనుల ఒత్తిడి...ఆఫీసులో ఇన్‌స్పెక్షన్!"

"కూర్చో... పకోడీలు చేయమంటావా?"

"ఉల్లిపాయలు వేసి మరీ!" అన్నాను.

"యస్సర్!" అంటూనే శనగపిండి డబ్బా తీసి గిన్నెలో పోస్తూ "రాజేశ్వరి ఎప్పుడు వస్తుంది...ఉత్తరం రాసిందా?" అన్నది తలెత్తి నా కళ్ళలోకి చూస్తూ.

తనకు తెలుసు...నాకు తెలుసు... రాజేశ్వరి పక్కన వున్నంత కాలం నేను ఆమెకు కనబడలేదని ..

"మనస్సు బాగోలేక ఒక గంట సరదాగా గడిపేద్దామని ఇక్కడకు వచ్చాను. రాజేశ్వరిని మరచిపోలేవా నువ్వు!"

సావిత్రి నవ్వింది. "నేను మర్చిపోతాను...నాకు చాలా తేలిక గూడా... కానీ నువ్వు మరచిపోతేనే కొంపలు అంటుకుంటాయాని భయం!"

చిలిపిగా నవ్వింది.

"ఎవరి కొంపలు?"

"నీవే!"

"నావి ఎప్పుడో అంటుకున్నాయి!"

"వాము కొద్దిగా వేస్తే బాగుంటుందేమో అనుకుంటున్నాను"...రాజేశ్వరికి వేసే అలవాటున్నట్లు నాకు గుర్తుంది!

"నన్ను వెళ్ళిపొమ్మంటావా?"

చటుక్కున పిండికలుపుతున్న చేతినే నా చేతిమీద వేసింది. నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తూ "కోపమా?" అన్నది.

"నాకు ఇష్టంలేని పని చేస్తున్నపుడు కోపం రాదా మరి." అన్నాను తగ్గుతూ.

పేలవంగా నవ్వింది సావిత్రి.

"నిన్ను చూస్తే నాకు జాలివేస్తోంది"

"నీమీద నీకంటే గూడానా?"

చాలా సేపు అలాగే నా ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయింది అవాక్కయిపోయి.

"స్టౌమీద నూనె మరిగిపోతోంది!"

"నీ మనస్సులోని కోపంలాగానా?"

"సత్యం."

"ఆవేశపడబోకు .. మనస్సును ప్రశాంతపరుచుకొని ఆలోచించు...మన మిద్దరం ఒకే బోటులో ప్రయాణిస్తున్నాం."

"సత్యం...సత్యం..."

"ఆవేశపడవద్దన్నానుగదా. ఒక్క క్షణం కళ్ళు మూసుకొని ఆలోచించు.. ఇందులో నా తప్పేమైనా వున్నదా? నేనేదో నీతో సర్వం మరచిపోయి సరదాగా గడుపుదామని వస్తే ఆ విషయం ఎత్తింది నువ్వు.. ఆవేశపడుతున్నది నువ్వు!"

లేకగాదు మాటలు అనవసరపు వాగ్వివాదానికి దారితీస్తాయేమోనని భయపడుతోంది

"ఒక్కపని చేయి...పకోడీలు చేసి పెద్ద ప్లేటునిండా పెట్టుకొని ముందు గదిలోకి తీసుకురా... తింటూ మాట్లాడుకుందాం...ఏ విషయమైనా పరవాలేదు ...ఆనందంగా వుంటుంది."

నేను లేచి ముందుగదిలోకి వచ్చి ఆ రోజు పేపరు చూస్తూ పడకకుర్చీలో కూర్చున్నాను.

తరువాత పావుగంటకు నేను చెప్పినట్లుగానే సావిత్రి ప్లేటునిండా పకోడీలు పెట్టుకుని వచ్చింది. మళ్ళా వంటింట్లోకి వెళ్ళి రెండుగ్లాసులతో చల్లటినీళ్ళు తెచ్చి పకోడీల ప్లేటుకు పక్కగా పెట్టింది

"మన మధ్య కోపతాపాలకు తావుండకూడదు." అన్నాను

"ఓకే!"

"ఫ్రీగా మాట్లాడుకోవడంలో తప్పు లేదుగదా... అంతేగాదు నా మాటల్ని నువ్వు నీ మాటల్ని నేను గౌరవించుకోవడం అంటే మనం ఒకళ్ళ నొకళ్ళు గౌరవించుకున్నట్లే!"

చాలా ముభావంగా వున్నది.

"ఓకే!"


"ఇక మొదలుపెట్టు. ముందు పకోడీలు తింటమా...లేకమాట్లాడడమా... నువ్వే నిర్ణయించాలి!"

ఫక్కున - అకస్మాత్తుగా వచ్చిన

"నాకు నవ్వు వస్తోంది."

"నవ్వేశావు గదా...ఇంకా మిగులేమైనా వున్నదా?"

ఎనిమిది గంటలయింది రోడ్డుమీద రాకపోకలు తగ్గడంతో ఆ ప్రదేశం మీద నిశ్శబ్దం ముసుగు కప్పినట్టయింది




పైన ఫ్యాను బయటనున్న వేడిగాలిని పీల్చి వాళ్ళమీదకే గుప్పిస్తున్నట్లుగా తిరుగుతున్నది

- "రాజశేఖరం ఎప్పుడు వస్తాడు?" నేనే మొదలుపెట్టాను.

సావిత్రి నా ముఖంలోకే చూస్తూ కూర్చుండిపోయింది. ఆపైన నవ్వి "ఆ స్వేచ్ఛ ఆయన కిచ్చేశాను." అన్నది.

"అంటే.. ?"

"అంటే ఏమున్నది...నా పద్ధతులు ఆయనకు నచ్చలేదు...ఆయన పద్ధతులు నాకు నచ్చలేదు. రోజూ తగువాడుకుంటూ ఎంతకాలం తన చెప్పుకింద కాపురం చేస్తాం...ఓ నెలరోజులు విడిగా వుండి చూద్దామనుకున్నాం."

"దట్స్ రైట్."

"ఓకే అన్నారు. విడిగా వుండటంలో లాభమెక్కువో...కలిసి వుండటంలో లాభమెక్కువో...కలిసి వుండటంలో నష్టమున్నదో...విడిగా వుండటంలో నష్టమున్నదో లెక్కచూసుకొని ఇద్దరం కూర్చొన్ని మాట్లాడుకుంటాం...ఏది బాగుంటే దానికి జిందాబాద్."

నేను నవ్వాను. "నేను అలా చేయలేదు నేను శాశ్వతంగా రాజేశ్వరిని ఇంటికి పంపేశాను...ఇంకా నావద్దకు రావద్దు అని గూడా చెప్పి పంపేశాను."

ఉలిక్కిపడ్డట్టుగా చూచింది నా ముఖంలోకి సావిత్రి.

"అంత ఘోరమైన తప్పుచేసిందా"

"తప్పుచేసే ప్రసక్తేమున్నది.. నువ్వన్నట్లుగానే నువ్వు చెప్పినట్లుగానే యిద్దరం కలసి ఉండలేకపోతున్నాం.. రోజూ యింట్లో వున్నంతసేపూ కొట్టుకోవడం తిట్టుకోవడం కంటే విడిగా వుండటమే యిద్దరి ప్రాణాలకి హాయి... ఒకచోటే వుండి మనస్సుకు శాంతిలేదని వాపోవటం.. నావలసి దాని బ్రతుకంతా నాశనమైపోయిందని అది ఏడ్వటం... ఎందుకు ఇవన్నీ...నువ్వు చెప్పు!"

చిన్నగా నవ్వింది సావిత్రి.

"పకోడీలు బాగున్నయ్యా?"

"మధ్యలో వాటి సంగతి దేనికి?"

"కూరలోను పులుసులోను నోటికి చిరుచేదు తగిలిందనుకో.. నోటికి కొత్త ఆవకాయ రాసుకుంటాం ..అలా!"

"నేను చెప్పింది చేదుగా వున్నదా?"

"కాక!"

"అప్పుడు నువ్వు చెప్పిందీ చేదుగానే వుండాలి గదా!"

"మేం శత్రువుల్లా విడిపోవటంలేదు. స్నేహితుల్లాగానే విడిపోతున్నాం!"

పెద్దగా నవ్వాను...ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లుగా నవ్వాను.

"పొలబోతుంది జాగ్రత్త!"

"నీ ఎదుట ఏమైనా ఫరవాలేదు!" ఆమె చేతిమీద చేయివేసి ప్రేమగా నొక్కుతూ అన్నాను.

ఆమె చేయి వెనక్కు తీసుకోలేదు. నావంక కోపంగా చూడలేదు. .నన్ను ఈసడించుకోనూ లేదు.

"మంచినీళ్ళు తాగరాదూ!"

"నాచేత నీళ్లు త్రాగిస్తావన్నమాట!"

నవ్వొస్తుంటోంది. ప్రేమ ఎప్పుడూ హృదయాంతరాల నుంచి రావాలి.. అలా జరిగేది జీవితంలో ఒక్కసారే... ఆవేశంలో నుంచి పుట్టేది క్షణికమైన వేడి తప్ప ప్రేమగాదు...వంటయింట్లో ఇంకా వున్నాయి పకోడీలు, తెమ్మంటావా?" అన్నది ఖాళీఅయిన ప్లేటును చూస్తూ ఆవేశాన్ని నిగ్రహించుకుని దృఢంగా.

"మనిద్దరి సంసార నౌకలూ విరిగినట్లే... మనిద్దరం కలసి మరో కొత్త నావను ఎందుకు సృష్టించుకోగూడదు!" చిన్నగా అన్నా చాలా సిన్సియర్‌గా అన్నాను

"కొత్త నావ దేనికి?"

ఆమె ఆవేశపడుతుందేమో అనుకున్నానుగాని ఆవేశపడలేదు. చాలా తాపీగా అన్నది

"జీవిత గమనానికి."

"నేను ఒడ్డుకు చేరానేమో అనిపిస్తోంది...ఇక నావతో పనేమున్నది. మరొక ఆసరా లేకుండా నేలమీద స్వేచ్ఛగా హాయిగా గడిపివేయవచ్చుగనా!"

ఏం సమాధానం చెప్పాలా అన్నట్టుగా క్షణం ఆమె మొఖంలోకే చూస్తూ కూర్చుండిపోయాను.



సావిత్రి ఆప్యాయంగా నా మొఖం లోకే చూస్తూ చిన్నగా నవ్వి - గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ ఓ నిట్టూర్పు విడిచింది ఎందుకో అ నిట్టూర్పు నన్ను ఓ క్షుదుపు కుదిపి ఉక్కిరిబిక్కిరిచేసింది

ఆమె కళ్ళు తడుస్తున్నట్లనిపించగా ఉలిక్కిపడ్డాను

అదేమిటి? కన్నీరు దేనికి?"

"జీవితం ఎంత విచిత్రమైంది." నా చేతిని తన చేత్తో గట్టిగా పట్టుకున్నది తడుస్తున్న మాటలు ముద్దముద్దగా వున్నాయి నెత్తిన బరువుపడుతున్నట్లుగా

ముందుకు వంగింది "నీ ఊహ నా కర్థమయింది సత్యం! జీవితానికి ఓ ఆడా మగా కలయికే ముఖ్యమని నేననుకోను రాజశేఖరమే నా సర్వస్వమనుకొని అతనిలో లీనమై ఇద్దరం ఒకటే అనేలా మెలిగాం. కాని ఈనాడు అది మిథ్య అయి కూర్చున్నది ఒకనాటి అలాంటి రాజశేఖరం ఈనాడు నాకు ఏమీ కాదేమో అనిపిస్తున్నదీ అంటే నాలోనే లోపమున్నదేమోననిపిస్తోంది ఆ నాలోని లోపాన్ని నేను తెలుసుకున్న నాడు, సరిచేసుకున్ననాడు తిరిగి ఆ రాజశేఖరమే నాకు దేవుడవ్వవచ్చు ఆయనకు నేను దేవతనూ అవ్వవచ్చు. ఆ విషయం మా యిద్దరికే తెలుసు కనుక పిచ్చిపిచ్చి ఊహలతో మనస్సును పాడు చేసుకోబోకు మనస్సును చంపుకోబోకు ఏవో రంగుటద్దాల కలయికలో మెరుస్తున్న ఈ శరీరాన్ని చూసి మోసపోయి జీవితాన్ని నాశనం చేసుకోబోకు కాస్త దెబ్బతగిలితే చెక్కలై, ముక్కలై నామరూపాల్లేకుండా పోయే ఈ క్షణికమైన మెరుపు నీ ఆనందాన్ని, తొలిచే విషపురుగు నీకు శాశ్వతమైన ఆనందం రాజేశ్వరిలోనే దొరుకుతుంది: మనస్సును స్వాంతన చేసుకొని ఆ ఆనందపు క్షణంకోసం ఎదురు చూస్తుండు."

నిరాశలో నుంచే కోపం పుట్టుకు వస్తుంది -

లేచి నిలబడ్డాను

నా కళ్ళల్లో కళ్ళుపెట్టి చూస్తూ నిల్చున్నది సావిత్రి నా చేయిపట్టుకొని నోటి దగ్గరకు జేర్చుకుని ముద్దుపెట్టుకున్నప్పుడు రెండు కన్నీటిబొట్లు నన్ను కాలుస్తూ నా చేతిమీద పడి ఆవిరయి మా యిద్దరి నడుమా తెరలను చకచకా కట్టేసినయి

నేను విసురగా బయటకు వచ్చాను.

వెనగ్గా నవ్వుతున్న సావిత్రి

"పిచ్చి సత్యం! ఆనందం ఖరీదు రాజేశ్వరి అవ్వగూడదు రాజేశ్వరి ఖరీదు ఆనందం అవ్వాలి!"

